# త్యాగం

రచయిత: శ్రీ మోతుకూరు వేంకటేశ్వర్లు
(వ్యాస సారస్వత సమితి)

"—వెళ్తావా?—వెళ్ళవా?—పో, ముందు యింట్లోంచి వెళ్లిపో—" అని, గోడలు ప్రతిధ్వనించేలాగు గట్టిగ అంటూ—అతను ఆమెను చేతిలోకి తీసుకొని బయటకు ఒక్క త్రోపును త్రోసాడు.

ఠకీ మని గోడకు తల తగిలి— కూలబడి పోయింది ఆమె. గాలి దుమారానికి వనికిపోయే, నును తీగలాగు!

కండ్లను పెద్దవిజేస్తూ—'పోతావా— పోవా?' అంటూ అతను కోపముగ అన్నాడు.

—వేటకానికి చిక్కిన లేడిపిల్ల లాగు వణికి పోతూ, యేమీ మాట్లాడింది కాదు ఆమె!

దగ్గరకువస్తూ—జీవురించుకు పోయిన ముఖంతో, కనుబొమలు ముడిచి, '—పోవేం, యింకా యింట్లోంచి ...పాపిష్టిముండా!—' అన్నాడు.

'...యిప్పుడు నావల్ల మీరేం తప్పును కని పెట్టారు—నేనేం చేశాను.' అని గద్గదికంగా—తపన బడుతూ అడిగింది కన్నీరు కారుస్తూనూ!—

"—ఛీ, యింకా నేను నీమాయ మాటలను నమ్ముతా ననుకున్నావా?... యీ వేషాలు నాకు తెలుసు" అని తలవెంట్రుకలను పట్టుకుంటానికి వంగాడు.

ఆమె—అతని రెండు కాళ్ళను పట్టుకొని దీనంగా ప్రార్థించింది—రోదించింది!—

—కరుగలేదాతని కఠిన హృదయం!

'—నన్ను నమ్మించి, నాకంట్లో దుమ్ము కొట్టావే?—యెంత, రంకులాడివి కాకపోతే,—నీకింత సాహసం కలుగుతుంది—ఛో'— అంటూ, రెండు కాళ్లను విడిపించుకొని ఒక్క తన్ను తన్నాడు గట్టిగ.

'—అమ్మో!' అంటూ పెద్ద పెట్టున అరచి దూరాన పడి పోయింది—ఆమె!

...హృదయములో, యెవరో చేయిపెట్టి కలచి నట్లు బాధపడుతూ—శ్వాసను దీర్ఘంగా పీల్చి వదుల్తూ —...

'...లే, నాముందు లే— వెళ్ళిపో, నీయిష్టమొచ్చిన వాడిదగ్గరకు—నాదగ్గర సాగవు నీవేషాలు' అన్నాడు అతను, ఆమెకు కొద్దిగ దూరంలో నిలుచొని.—

నోటివెంట మాట పెగులక, దీనంగా చూసిందతని వేపు కళ్ళంట నీరు కారుతూ ఆమె!

'—ఊహు—యిహనే నొప్పుకోను. ఒక్క క్షణంగూడా—నావద్ద యీ యింట్లో వుండ నవుసరంలా?—'అంటూ, తీక్షణంగా చూసాడు.

'—యేం చూశారు నాతప్పు?' అంది ఆమె దైన్యంగా!

'ఆఁ—యేంచూశానా?— దబాయిస్తున్నావే పైగా!...అతనెవడు, నేను సందుమలుపు తిరక్క ముందే— యింట్లోంచి బయటకొచ్చి అటు వెళ్ళి పోయాడు?......యేం?—మాట్లాడవు?' అని గర్జించాడు—

శిలా ప్రతిమలాగు చైతన్యాన్ని కోల్పోయి చూస్తూ నిలుచుంది ఆమె!

'— తెలుసుకున్నానని తెల్లబోతున్నావా— యేం? యెన్నాళ్లు దాగుతుంది పాపం!—...యెప్పట్నుంచి యీపని ప్రారంభించావు...లే, యికనైనా—?' అని దగ్గరకు వెళ్ళాడతను.

'...యెవరండీ! యెవరు-యెవరొచ్చారిప్పుడు?-' అంటూ దుఃఖించిందామె!—

'యెవరా?—యింకా నన్ను మోసపుచ్చాలనే, ...రంకునేర్చిన దానివి బొంకనేర్వక పోతావా?— ...యివన్నీ నావద్ద వుడకవు సుమా?—లే!—' అంటూ తలవూపాడు.

'...యెవరండీ!—మా అమ్మ తమ్ముడు వచ్చినా, యిలా అనుమానం పడితే—యెలా?'—అని ప్రశ్నించిందామె. కళ్లనీల్లు పైటచెరగుతో తుడుచుకుంటూ!—

'—రంకునేర్చిన దానివి బొంక నేర్వక పోతావా?— నాతో వచ్చెయ్యాల?— అలానే, యిదొహ బ్రహ్మాండమా?'—అన్నాడతను.

'...యిన్ని రోజులున్నండీ—చివరకు, యిదా మీరు కనిపెట్టింది నావిషయములో!—ఏముంది నోటికడ్డం...' అన్నది విచారంగా ఆమె!

—నౌకరీ చేయాలి అన్న ప్రసక్తి లేకుండానే, సుఖంగా—కాలం, వెళ్లబుచ్చే—గౌరవ మర్యాదలు గల కుటుంబములో జనించి, యఫ్. ఏ. వరకు చదువుకున్న ఉపజ్ఞవంతుడు!

తెలివి తేటలలో,— అందెవేసిన చేయి!— పైగా చిత్రకారుడూ—రచయిత!

అసలు అతను ఒక నిరాడంబర జీవి—

యిహ ఆమె!—

చెడిపోయిన స్త్రీకి పుట్టిన ముద్దుల బిడ్డ! సుందరములయిన, నేత్రాలుకు— అలంకారముగవుండే, విశాల ఫాలభాగముపై— భరతనాట్యాన్ని చేస్తున్న ముంగురులతో, ముద్దులొలికే— మోవి!

చదువుకోనక పోయినా,—సర్వమూ తెలిసిన జాణ!—ముదుసలులను గూడా— ముగ్ధుల్ని చేసే, దృక్ప్రిభావం—ఆమె ఆయుధం!

ఆమెకు యిద్దరు తమ్ములుగూడా— ఈపరిస్థితిలో పాదిపనిచేసి, తల్లీ బిడ్డా—సంసారాన్ని సుఖమయంగా చేస్తున్నారు.

తండ్రి ఒక త్రాగుబోతు—

అందరి దృష్టులూ, ఆమెను రహస్యంగా దగ్గరకు తీయాలని—కోరిక!

ఒప్పుకోనేది కాదు—

తల్లి మనసుగూడా,—పైపైన ఆమెను త్రిప్పి —డబ్బును సంపాదిద్దామన్న వుద్దేశంతో—మనసు విరచేందుకు ప్రయత్నించేది—నిష్ఫల మయ్యేది!

—చలాకిగా నడుస్తుంటే, గుటకలువేస్తూ చూస్తుండేది యువక వర్గం!

...చెడిపోయిన స్త్రీని—చేపట్టే దెవరు?—

♦ ♦ ♦

అతనికిని ఆమెకునూ—మనసులు కలసినవి!

—పాడు సంఘాన్ని, లోకాన్ని— తలిదండ్రులను త్రోసిపుచ్చి దగ్గరకు తీసాడతను!

పని పాటలు మానేసి, గృహిణిగా తయారైంది ఆమె!—లోకం అనేక విధాలుగా తలపోసింది.

బంధువర్గం స్నేహితులు—అతన్ని అనేక విధాలుగ అడిగారు—తనకు వారితో, సంబంధమే లేదని తెలిపా డతను!

—సమాజానికి సంబంధించే కథలను వ్రాసి, ఆ వచ్చిన పైకంతో—సుఖమయ జీవనం గడిపేవారిద్దరూనూ!

రెండు సంవత్సరాలు ప్రేమమయ తరంగాల్లో— తేలిపోయింది వారి జీవిత నౌక!

ఆరెండు సంవత్సరాలు— రెండు రోజులుగా గడిచి పోయాయి వారికి—నిర్విచారంగా!—

ఆసుఖమయ జీవనంలో, ఆకాశ సౌధాలు నిర్మించుకుంది ఆమె!

—లోకంతోపాటు తనుగూడా, ఒకగృహిణే!

ప్రేమాదరణాలతో, అనురాగంగా జూచే ఆదర్శ యువకుడు తన భర్త!—

యితర చింతలేవీ, ఆమె హృదయములో—తిరగేవే కావు!—

రెండు సంవత్సరాలుగా యిలా గడిచిపోయింది!

—కొన్ని రోజులకు, అతని హృదయములో చిన్న అనుమానం తోచింది.

—తుపానుకుముందు చిన్న గాలి దుమారములా, అది పెద్దదై అతని హృదయములో నాటి పోయింది.

వూరికినే అనుమానిస్తుండే వాడు—

—యే సినిమాకు వెళ్లినా, యెక్కడకు వెళ్లినా, అతనికి ఇదే ఆలోచన! "—పాడు స్మశాన వాటికలో, తులసిమొక్క పుట్టుందా?—పుట్టినా, అది సాంతం వరకు బ్రతుకుతుందా?" యిదే అతని వూహా చింతలకు ప్రాతిపదిక!—

రెండు సంవత్సరాలుగా రాకపోకలు లేక— అనుకూల దాంపత్యంలో—ఆనంద తరంగాల్లో మునిగిన తన మేనకోడలిని చూచేందుకు, ఆమె మేనమామ వచ్చాడు.

ఆసమయంలో, అతను యింటివద్ద లేడు—

కొద్దిసేపు కూచొని, కోడలి క్షేమ సమాచారములు, తెలుసుకొని వెళ్ళిపోయాడు మామ.

యివీ అసలు విషయం!—

♦ ♦ ♦

—పాపం యెన్ని చెప్పినా, యెంత వేడుకున్నా వినలేదతను!

ప్రతిమాలింది—వేడుకొంది, తన నిట్లా విడిచి వేయడం, అన్యాయం—అని ప్రార్థించింది!— కసురుకున్నా డతను.

'అమాయకురాలిని, యీవిధంగా అన్యాయం చేయడం—' మంచిది కాదంది—

వినలేదతను.

'—సంస్కర్త ప్రబోధాలు చేస్తూ—రసవత్తరమయిన, కథలను చిత్రించే రచయితవై వుండికూడా —యీవిధంగా తన ప్రేమను భంగపరచడం—మీ వంటి విజ్ఞానులకు, తీరని కళంకం!—'అని యేడ్చింది.

—యేంలాభం, అన్నీ అడవినగాచిన వెన్నెల్లా—అరణ్యరోదనమయినై!

అతను తనకివేవీ, అవసరం లేదంటూ—నిర్దయత్వంతో, నిండు చీకట్లో—బయటకు నెట్టివేశాడు .........పాపం యేంచేస్తుంది?—

అబల!—అనుకున్న ఆకాశహర్మ్యాలు అడుగంటిపోగా,! దిక్కులేని యేకాకినిలా, యెక్కడికో వెళ్ళిపోయింది!......

—పండు వెన్నెల్లో, పసిడినిగ్గులతారలతో—ఆడుకుంటున్న చంద్రుడ్ని ఒక నల్లటి మబ్బు కప్పివేశింది!

యెక్కడికో యెగిరిపోతూ—వికృతస్వరంగా, గుడ్లగూబ ఘీంకారం చేసింది!—

...............

♦ ♦ ♦

—యింటికికీ పోకుండా, హోటల్ జీవితం ప్రారంభించాడు!

తన 'త్యాగాన్ని'—కూడా గుర్తించకుండా!—తన్ను వంచించిందే—అని తలపోస్తుండేవాడప్పుడపుడు.

వెన్నెలరాత్రుల ఉషః కాంతులలో,— వాలు కుర్చీలో డాబాపై పండుకొని,—మరుగుపడిన ముందు' దినాలను తలపోస్తూ—కంటిపై కునుకురేకుండా,—అశ్రుబిందువులతో, అరుణోదయాన్ని వచ్చేవాకు క్రిందకు!

♦ ♦ ♦

—మునుపటిలా—ముగ్ధుల్ని చేయడంలా—అతని రచనలు!

—ప్రతిరచనా, పాఠకునికి విసుగుదల కలిగిస్తుంది. సంబరంతో, చేయిచాపే సంపాదకులు—అతను పంపిన రచనను పత్రికలో ప్రింటుచేయడమే, గొప్ప బ్రహ్మాండమవుతుంది!

చిత్రకళలోనూ—సొంపులు తిరగడంలేదాతని చేయి!—

♦ ♦ ♦

మూడు నెలలు గడచిపోయినా, ముగ్ధరాలు—పవిత్ర ప్రేమను తన మనసులోనుండి తుడవలేకపోయింది!—

'—తన తప్పు తాను తెలుసుకొని, యెప్పటికయినా—యెరిగిరాడా!— ఆదరించడానికి'— అని తపిస్తూ, యెదురు చూస్తుంది!

యేమీ తెచ్చుకోకుండా—యిల్లువెడలివచ్చిన, కోడలిని మేనమామ ఆదరణతో, ఆదరించాడు!

—చదువుకున్న యువకుడూ— సంస్కర్తా! ముందువెనుక లాలోచించక, కోడలిని బయటకు త్రోసినందుకు—మనసులో మండిపడి 'మంచి గుణపాఠం నేర్పాలి మందమతికి' అని నిర్ణయం చేసుకున్నాడు—మామ.

—మామ మనసులోనున్న క్రోధాన్ని గమనించి—అదుర్దాపడింది ఆమె!—

'రక్షించు తండ్రీ,—ఆ అమాయకుడిని' అంటూ ప్రార్థించేది ప్రతిదినమూ పరమేశ్వరుణ్ని!—

—యేంచేస్తుంది మరి!

...మామ చేస్తున్న ప్రతిపనీ,— మరచిపోకుండా, చూస్తుండేది!

—సాయంకాలం అవుతే, మత్తుపదార్థం సేవించి—మామయిట్లో—అతన్ని అనేక విధాలుగ తిట్టేవాడు.

ఆమె దుఃఖించేది!—

♦ ♦ ♦

ఆరాత్రి— పూర్తిగా త్రాగి, 'చంపుతాను దుర్మార్గుడిని' అంటూ కర్రనొకదాన్ని తీసుకొని— తూలుతూ బయలుదేరాడు మామ.

అడ్డగించింది ఆమె!—

—చుట్టుప్రక్కలవాళ్ళు చుట్టివేసారు.

పడద్రోసి అందర్నీ, పదిమైళ్ళవేగంతో—పరుగెత్తాడు.

—కొంతదూరం పరుగెత్తినా, కలుసుకోలేక— వెనక్కు మళ్ళారు విసిగిపోయి జనం!

తెగిపోయిన, మహతిలా— టువుటువ్వుమనే గుండెల్ని, అరచేతుల్లో పట్టుకొని—అడుగులు పెకలించుకుంటూ, మామ వెనకాలె వస్తుంది ఆమె.

...............

—నల్లమబ్బు చాటున, నిలుచున్నాడు చంద్రుడు!

జంటలు జంటలుగా, తళుకు తళుకుమని మెరస్తూ—యేంజరుగుతుందో చూద్దామని చూస్తున్నై— తారాగణం!

♦ ♦ ♦

పండు వెన్నెలలోని, పరిపూర్ణ శోభను పరికిస్తూ—బయట కూచున్న అతను—దూరాన వినబడుతున్న బండకేకలకు, తెప్పరిల్లి లేచి—తేరిచూచాడు!

'—పోకిరీ వెధవతో, ప్రేయసి తిరిగి తన యింటికి, రావడం'చూచి—అర్థంకాలేక ఆశ్చర్యంతో నిలుచున్నాడు.

"...దుర్మార్గుడా!—యవ్వనంలోవున్న యువతిని—యిష్టమొచ్చినట్లు వాడుకొని,...లేనిపోని నిందలుమోపి— వెళ్లగొట్తావా?— యెవర్రా నీకు దిక్కు?"—అంటూ, ముందువెనుకలు చూడకుండా— కర్రను విసిరాడు నెత్తిపైకి మామ.

'అయ్యో—అయ్యో!' అని అడలి— మధ్యకు వచ్చి, 'అమ్మో'—అంటూ కూలబడిపోయింది ఆమె!—

కైపెక్కిన మామ, కోడలి కేకతో, తెప్పరిల్లి— అయోమయంగా చూచాడు ఆమెవేపు.

'ఆలోచించకుండా,—తను వెడలగొట్టినా, తనయందు ప్రేమతో,—తన చావుకు ఆమె బలి అయినందుకు—నోటివెంట మాటపెగులక, శిలాప్రతిమలాగు తెల్లబోయి...ఒకే దెబ్బకు తలపగిలి, నెత్తురు వెదజల్లుతూ పడిపోయిన ప్రేయసిని దగ్గరకు తీసుకుంటూ— దుఃఖించాడు,— వెర్రిగా!—

దూరంగా, దంపతుల్లా జంటగానున్న తారాగణంలో,—'నీలాలనింగినుండి నేలకు జారింది' ఒక నక్షత్రం!

...............

నల్లమబ్బు చాటునుండి— చంద్రుడు, తొంగి చూస్తూ—నివ్వెరపడ్డాడు తెల్లబోతూ!—

(పాడులోకంనుండి—)

*SALE!* *SALE!* *SALE!*

**Reduced Sale Price Rs. 3-12-0**




జెంట్స్ లివర్ రిస్టువాచ్ నెం. 43

పూర్వపు ధర రు 8. ఇప్పటి ధర రు 3-12-0. స్విజర్‌లాండ్ దేశములో లివర్ సామానులతో చేయబడినది. ఒక్క నిమిషమైనను తేడాలేక కాలం సరిగా చూపును. ఇండియా అంతటను అనేక వేలు యీమాదిరి గడియారములు అమ్మియుంటిమి. కాని యింత తక్కువ ధరలకు అమ్మియుండలేదు. చేతియందు ధరించిన బంగారపు ఆభరణమువలె యుండును. రోల్డుగోల్డు కేస్ నెం. 43, రు 3-12-0. 3 సం॥ గ్యారంటీ.

**WESTERN SWISS WATCH CO.,**
**Direct Importers. Post Box No. 68, Madras**